సాక్షి
ప్రకాశం
సోమవారం । 14 । జులై । 2025



కారు ఢీకొని ఇద్దరు మృతి

కారు–బైకు ఢీకొని ఇద్దరు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మార్కాపురం మండలం తిప్పాయపాలెం -జంగగుంట మధ్య జరిగింది. - 8లో..



చంద్రబాబు మేనిఫెస్టో మొత్తం అబద్ధాలే

చంద్రబాబు మేనిఫెస్టో మొత్తం అబద్ధాలేనని మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 37 /29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

ఊరూరా ఎల్లో బెల్ట్

ఎల్లో 'బెల్ట్'..పచ్చని పల్లెలకు ఉరితాడుగా మారుతోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలతో మద్యం వ్యాపారులు రెచ్చిపోతున్నారు. మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్న పచ్చపార్టీ నేతలు లైసెన్సు షాపులకు అదనంగా పది నుంచి 15 బెల్టు షాపులు పెట్టి యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. బెల్టు షాపుల వద్దే సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి పగలు, రాత్రి తేడా లేకుండా మందుపోస్తున్నారు. కొన్ని చోట్ల ఏకంగా ఆటోల్లో, బైక్ మీద వీధివీధినా తిరుగుతూ మద్యం అమ్ముతున్నారు. మామూళ్ల మత్తులో ఉన్న ఎక్సైజ్ అధికారులు వాటివైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. మొక్కుబడి దాడులు.. నామమాత్రపు హెచ్చరికలతో సరిపెడుతున్నారు. దీంతో బెల్టుషాపుల దందాకు అంతులేకుండా పోతోంది.



జిల్లాలో లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు 171

గీత కార్మికులకు కేటాయించినవి 10 శాతం

మొత్తం లైసెన్స్‌డ్ షాపులు 189

బెల్టుషాపులు 2,500

- టీడీపీ నేతల కనుసన్నల్లోనే మద్యం దుకాణాలు, బెల్టు షాపులు
- గ్రామాల్లో దేవుడి పేరుమీద వేలం వేసి బెల్టు షాపులు దక్కించుకుంటున్న తమ్ముళ్లు
- బెల్ట్ షాపుల కోసం తమ్ముళ్ల సిగపట్లు
- ఫోన్ చేస్తే చాలు ఇంటికే మద్యం
- మంత్రి ఇలాకాలో ఏకంగా బైకు మీద వీధుల్లో తిరుగుతూ మద్యం అమ్మకం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన మద్యం పాలసీని ప్రకటించింది. ప్రభుత్వ మద్యం దుకాణాలను తీసేసి దాని స్థానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. జిల్లాలో 171 మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేసింది. దీనికి అదనంగా గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు కేటాయించింది. జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడు గ్రామానికి చెందిన ఆళ్లదాసుకు ఒక షాపును కేటాయిస్తూ ప్రకటించారు. మొత్తం మీద ప్రస్తుతం జిల్లాలో 189 మద్యం దుకాణాలున్నాయి. ఇటీవల మద్యం వ్యాపారం ద్వారా టీడీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నాయకులకు ఆదాయాన్ని సమకూర్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. జిల్లాలోని మద్యం దుకాణాలన్నిటినీ చేజిక్కించుకున్న టీడీపీ నాయకులు ప్రభుత్వ అండదండలతో యథేచ్ఛగా మద్యం విక్రయించడం మొదలు పెట్టారు. ఒక్కొక్క లైసెన్స్‌డ్ మద్యం దుకాణానికి అదనంగా పది నుంచి 15 బెల్టు షాపులు పెట్టుకొని గ్రామాల్లో మద్యం అమ్మకాలు చేపట్టారు. ఫోన్ చేస్తే చాలు ఇంటికే మద్యం తెచ్చి ఇచ్చేంతగా వ్యాపారాన్ని విస్తరించారు.

మంత్రి స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు మండలం ఎం.నిడమానూరులో ఏకంగా బైక్ మీద వీధి వీధిలో తిరుగుతూ మొబైల్ మద్యం వ్యాపారం సాగిస్తున్నారు. ప్రజల దాహార్తి తీర్చడం చేతకాని ప్రభుత్వం జిల్లాలోని ప్రతి గ్రామానికి మద్యాన్ని మాత్రం సరఫరా చేస్తోంది. కూటమి ప్రభుత్వం ప్రజలను మద్యం మత్తులో ముంచుతోందని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

తెల్లవారుజామున 5 గంటల నుంచే...

ప్రభుత్వ నిబంధనలను ఏ మాత్రం ఖాతరు చేయకుండా జిల్లాలో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లోనే బెల్టు షాపులు నిర్వహిస్తుండడంతో ఎక్సైజ్ అధికారులు ఇటు వైపు తొంగి చూసే సాహసం చేయడం లేదు. దాంతో బెల్టుషాపుల నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా తయారైంది. బెల్టు దుకాణాల వద్ద ఏకంగా సిట్టింగ్ ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. రాత్రి పూట ప్రత్యేకంగా మనిషిని నియమించి మరీ మద్యం విక్రయిస్తున్నారు.

దేవుడి పేరుతో వేలంపాటలు..

జిల్లాలో అనేక గ్రామాల్లో దేవుడి పేరుతో బెల్టు షాపులను వేలం పాటలు వేస్తారు. గిద్దలూరు నియోజకవర్గంలోని 15 గ్రామాల్లో వేలంపాట పెట్టుకొని బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. బేస్తవారిపేట మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె, చిన ఓబినేనిపల్లె, జేసీ అగ్రహారం, ఎంపీ చెరువు, బసినేపల్లి, గంటాపురం, కొత్తపేట, పీవీపురం, గలిజేరుగుళ్ల, పూసలపాడు గ్రామాల్లో దేవుడి పేరుతో వేలం పాటలు వేసి బెల్టు షాపులు దక్కించుకున్నారు. ఒక్కో గ్రామానికి అక్కడి జనసాంద్రత, ఆర్థిక స్థితిగతులను బట్టి రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు వేలం పాడుకున్నట్లు తెలుస్తోంది. గిద్దలూరు మండలం సంజీవరాయునిపేటలో రూ.2.5 లక్షలకు వేలం పాడినట్లు సమాచారం. మార్కాపురం నియోజకవర్గంలోని తర్లుపాడు మండలం తుమ్మల చెరువులో పీర్ల పండుగ సందర్భంగా వేలం పాట నిర్వహించారు. కేవలం మూడు రోజులకు గాను రూ.3 లక్షలకు పాట పాడినట్లు ప్రచారం జరుగుతోంది. సింగరాయకొండ మండలంలోని మత్స్యకార గ్రామాల్లో కూడా వేలం పాటలు నిర్వహించినట్లు తెలుస్తోంది. పాకల, ఊళ్లపాలెం గ్రామాల్లో వేలం వేసి వచ్చిన సొమ్ముతో గ్రామాభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇక్కడ రూ.5 నుంచి రూ.15 లక్షల వరకు వేలం పాట వేసినట్లు తెలుస్తోంది. వేలం పాటలో బెల్టు షాపులు దక్కించుకున్న వారు మాత్రమే ఇక్కడ మద్యం విక్రయించాలి. బాటిల్ మీద రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేసే అధికారం కూడా నిర్వాహకుడికి ఉంటుంది.



టంగుటూరు మండలం ఎం.నిడమానూరులో బండిలో నుంచి మద్యం సీసా తీసి అమ్ముతున్న మొబైల్ మద్యం వ్యాపారస్తుడు (ఫైల్)

మద్యం విక్రయ కేంద్రాలుగా మారిన దాబా హోటళ్లు...

రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకున్న దాబా హోటళ్లలో నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఎటు చూసినా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల పక్కన అనేక దాబా హోటళ్లు వెలిశాయి. రాత్రయితే చాలు దాబా హోటళ్లు మందుబాబులతో కిటకిటలాడుతున్నాయి. ఇక్కడ వారు తాగి తందనాలాడటానికి సిటింగ్ ఏర్పాటు ఉండడంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. దీంతో తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల ఒంగోలు నగర శివారులో వెంగముక్కలపాలేనికి వెళ్లే దారిలో ఉన్న ఒక దాబాలో అర్ధరాత్రి జరిగిన గొడవ రణరంగాన్ని తలపించింది. బిల్లు చెల్లించే విషయంలో హోటల్ నిర్వాహకులు, కస్టమర్లకు మధ్య చోటుచేసుకున్న వివాదం చినికి చినికి గాలివానగా మారి ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు చితక్కొట్టుకున్నారు. దాబా హోటళ్లు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లలో మద్యం తాగే ఏర్పాటు చేయడం, అర్ధరాత్రి వరకు హోటళ్లు నిర్వహించడం, మద్యం తాగే వారికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేయడం, మందుబాబులకు సిట్టింగ్ ఏర్పాటు చేయడం లాంటివి జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని, నెలవారీ మామూళ్లు తీసుకుంటూ వీటిని పోలీసులు ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు అధికార పార్టీ మద్దతు ఉండడంతో దాబా నిర్వాహకులు రెచ్చిపోతున్నారు.



చీమకుర్తి మండలం మంచికలపాడులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బెల్టు షాపు

మామూళ్ల మత్తులో అధికారులు...

జిల్లాలో దాదాపు 2500 బెల్టు షాపులు ఉన్నాయంటే ఏ స్థాయిలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. అయినా ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు. నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపులపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బెల్టు షాపుల అమ్మకాలను బట్టి ఒక్కో షాపునకు రూ.5 నుంచి రూ.10 వేల వరకు ఎక్సైజ్ అధికారులకు ముడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొదిలి మండలంలోని కాటూరివారిపాలెం నుంచి పడమర వైపు పోతవరం గ్రామం వరకు ప్రధాన రహదారిలో ఏకంగా 10 బెల్టు షాపులు నిర్వహిస్తున్నా అధికారుల కంటికి కనబడడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దర్గా నుంచి రైల్వే బ్రిడ్జి వరకు బహిరంగంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

న్యూస్‌రీల్

సీసీటీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్:

సీసీటీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్, సెక్యూరిటీ అలారం ఏర్పాటుపై ఉచిత శిక్షణ అందించనున్నట్లు రూడ్ సెట్ సంస్థ డైరక్టర్ పీ శ్రీనివాస రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకూ 13 రోజుల పాటు ఈ ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు అర్హులన్నారు. 18 ఏళ్ల నిండి 45 సంవత్సరాల లోపు వయస్సున్న వారు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయాలు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు 9573363141 అనే నంబరు పై సంప్రదించాలన్నారు.

జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

ఒంగోలు వన్‌టౌన్:

జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 15న జాబ్‌మేళాను ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఐఎల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, విజన్ ఇండియా సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ నిప్పార్ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీలలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, ప్లానింగ్ ఆఫీసర్, మార్కెటింగ్ సెక్టార్‌లలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ ఆపైన విద్యార్హత, ఐటీఐ, డిప్లమో విద్యార్హత కలిగి ఉన్న వారు అర్హులన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలని చెప్పారు. అర్హత, ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.28 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల ఫొటోస్టాట్ కాపీలతో హాజరు కావాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు కార్యాలయం పనివేళల్లో 08592-281776 అనే నంబరుపై సంప్రదించాలన్నారు.

మహిళలపై దాడులు మానుకోకుంటే ఖబడ్దార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- మహిళలపై దాడులు చేయడమేనా మంచి ప్రభుత్వమంటే
- జెడ్పీ చైర్‌పర్సన్‌కే రక్షణ లేకుంటే ఇక సామాన్య మహిళల పరిస్థితేంటి
- ఇదే ధోరణి కొనసాగిస్తే చూస్తూ ఊరుకునేది లేదు
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఇంటి నుంచి బయటకు రావాలంటే మహిళలు భయపడుతున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విమర్శించారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మీద తెలుగుదేశం, జనసేన గుండాలు చేసిన దాడిని ఖండిస్తూ వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒక బీసీ మహిళా నాయకురాలు, జిల్లాకే ప్రథమ పౌరురాలి మీద దాడి చేయడం, ఆమె కారు అద్దాలను పగులగొట్టి, రాళ్లతో దాడులు చేసి ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. హారికను రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికంగా హతమార్చేందుకే ఈ దాడి జరిగిందన్న అనుమానం వ్యక్తం చేశారు. గుడివాడలో జరిగిన దాడి దృశ్యాలను టీవీల్లో చూసిన రాష్ట్ర ప్రజలు, మహిళలు భయాందోళనకు గురయ్యారని చెప్పారు. ఒక మహిళ హోం మంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోవడం సిగ్గుచేటన్నారు. హారిక మీద దాడిని హోం మంత్రి ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసులు ఉన్నారా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. మహిళల మీద దాడులు చేయడమేనా మంచి ప్రభుత్వమంటే అని చురకలంటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అరగంటలోనే జెడ్పీ చైర్ పర్సన్ల గన్‌మెన్లను తొలగించారని, వారిని కొనసాగించి ఉంటే నేడు ఈ దాడి జరిగేదే కాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జనంలోకి వస్తుంటే మీకెందుకింత భయం అని నిలదీశారు. జగన్ పర్యటనలకు వేలాదిగా జనం తరలిరావడాన్ని చూసి రాష్ట్ర ప్రభుత్వం వణికిపోతుందని ఎద్దేవా చేశారు. రేపు తాము అధికారంలోకి వస్తామని, ఈ రోజు గుండాయిజం చేసిన వాళ్లకు తగిన పాఠం చెబుతామని హెచ్చరించారు. రాష్ట్రంలో వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని, మీ ధోరణి మార్చుకోకుంటే ఇంతకింత అనుభవిస్తారని స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని చెప్పారు. పార్టీ సమావేశాలకు హాజరవుతున్న కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ హారిక మీద టీడీపీ గూండాలు దాడులు చేయడం దుర్మార్గమన్నారు. మహిళలను ఏదైనా మాట అంటే ఊరుకోనన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడెందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీపీ గాయం సావిత్రి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి రవణమ్మ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడికొండ జయంతి, పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ అఫ్సర్, వాలంటీర్ విభాగం రాష్ట్ర కార్యదర్శి గోనెల మేరీ కుమారి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు పేరం ప్రసన్న, నియోజకవర్గ అంగన్‌వాడీ అధ్యక్షురాలు వడ్లమూడి వాణి, సిటీ మహిళా అధ్యక్షురాలు బత్తుల ప్రమీల, మద్దలూరు సర్పంచ్ కె.రమణ, నాగమణి, నాగలక్ష్మి, బి.శైలజ, కె.లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీర్ల గుండంలో పడి విద్యార్థికి గాయాలు


గాయాలపాలైన వెంకటసాంబ

పెద్దదోర్నాల: ప్రమాదవశాత్తూ పీర్ల గుండంలో పడి విద్యార్థికి గాయాలైన సంఘటన ఆదివారం వేకువజామున పెద్దదోర్నాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మొహర్రం పండుగ సందర్భంగా శనివారం రాత్రి పెద్దషరగత్ నిర్వహించారు. స్థానిక మెట్టబజారుకు చెందిన 8వ తరగతి విద్యార్థి గోగుల వెంకటసాంబ స్నేహితులతో కలిసి మొహర్రం ఉత్సవాలు చూసేందుకు ఆదివారం వేకువజామున పీర్ల చావిడి వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ పీర్ల గుండంలో జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో వెంకటసాంబ ఎడమచేయి, పొట్ట భాగం, కాలి వేళ్లు కాలిపోయి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు.

12 మంది జూదరులు అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న జూదరులు

కొనకనమిట్ల: కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన కొనకనమిట్ల మండలంలోని చినమనగుండం పంచాయతీ బ్రాహ్మణపల్లి పొలాల్లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకరరెడ్డి కథనం మేరకు.. బ్రాహ్మణపల్లి సమీపంలోని పొలాల్లో జూదరులు కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎస్సై తన సిబ్బందితో మెరుపుదాడి చేశారు. 12 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న కోళ్లతోపాటు రూ.11200 నగదు, 10 సెల్ ఫోన్లు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పొదిలి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

నాగులుప్పలపాడు: మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామంలో పేకాటాడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు నాగులుప్పలపాడు ఎస్సై రజియా సుల్తానా తెలిపారు. ఆ గ్రామంలో విచ్చలవిడిగా పేకాటాడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. అక్కడ పేకాటాడుతున్న 11 మందిని పట్టుకున్నట్లు వెల్లడించారు. వారి నుంచి రూ.46,330 నగదు సీజ్ చేశామని, కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్సై వివరించారు.

ఇంటి స్థలాలు ఆక్రమిస్తున్నారు


టీడీపీ సానుభూతిపరులు పడగొట్టిన గోడను చూపిస్తున్న వెంకన్న

సింగరాయకొండ: ప్రభుత్వం తమకు కేటాయించిన ఇంటి స్థలాన్ని కొందరు టీడీపీ సానుభూతిపరులు ఆక్రమిస్తున్నారని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చొప్పర వెంకన్న, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికల సునీల్‌కుమార్ ఆరోపించారు. 1982లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న ఎస్సీలకు సింగరాయకొండ-కందుకూరు రోడ్డులోని ఎస్సీ బాలుర వసతి గృహం వెనుక సర్వే నంబర్ 686-2లో సుమారు 2.50 ఎకరాల స్థలంలో రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. ఆ స్థలంలో ఎవరూ ఇళ్లు నిర్మించుకోకపోవడంతో కాలక్రమంలో ఇళ్ల పట్టాలు రద్దయ్యాయన్నారు. అదే స్థలంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా తన భార్య పేరు రత్నకుమారికి సైతం స్థలం దక్కిందని వెంకన్న వివరించారు. తమ స్థలంలో గోడ కూడా నిర్మించామన్నారు. కానీ ఇటీవల టీడీపీ సానుభూతిపరులు తమ స్థలంలో గోడను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఆదివారం గోడను పునర్నిర్మించుకునే ప్రయత్నం చేయగా అడ్డుతగిలారన్నారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ పుల్లారావుకు ఫిర్యాదు చేస్తే వీఆర్‌ఓలను పంపిస్తామని చెప్పారని, కాని ఎవరూ రాలేదన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఇంటి స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. న్యాయం చేయకుంటే ధర్నా చేస్తామని, హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి

సింగరాయకొండ: రైలు ఢీకొని సుమారు 32 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో ఉత్తరం వైపు ప్లాట్‌ఫాం వద్ద జరిగింది. ఒంగోలు జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. మృతుడు తెలుపు రంగు టీషర్టు, తెలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. గడ్డం బాగా పెరిగి ఉంది. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఆచూకీ తెలిసిన వారు 9440627647 సెల్ నంబర్‌కు సమాచారం అందించాలని జీఆర్పీ పోలీసులు సూచించారు .మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

చంద్రబాబు మేనిఫెస్టో మొత్తం అబద్ధాలే..

● వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు:

ఎన్నికల సమయంలో చంద్రబాబు, కూటమి పార్టీలు విడుదల చేసిన మేనిఫెస్టో మొత్తం అబద్ధాల పుట్టలా ఉందని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారంటూ మండిపడ్డారు. మద్దిపాడులోని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మొదటి నుంచి మోసపూరితమైన వ్యక్తి అని, ఆయన చెప్పేది ఒకటి..చేసేది మరొకటని ఎద్దేవా చేశారు. ఆయన చెప్పే ఏ ఒక్క విషయం నిజం కాదన్నారు. 2014–19లోనూ ఇలానే చేసిన చంద్రబాబు.. అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. పసుపు, కుంకుమ అని, మహిళలకు పెద్ద పీట అని చెప్పారని, చివరకు 2019 ఎన్నికలు దగ్గరపడిన తర్వాత అప్పటికప్పుడు ఓట్ల కోసం పసుపు ఇచ్చారని, గెలిచిన తర్వాత కుంకుమ ఇస్తానని చెప్పారని, ఆయన మోసాలను గ్రహించిన ప్రజలు ఘోరంగా ఓడించారని మేరుగు నాగార్జున వివరించారు. 2024 ఎన్నికల్లోనూ ఆయన మోసపూరిత మాటలు నమ్మి ప్రజలు గెలిపిస్తే..


బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ పోస్టర్లు విడుదల చేస్తున్న మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు

ఇప్పుడు కూడా పంగనామాలు పెడుతున్నాడని విమర్శించారు. చంద్రబాబు 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఏడాది పాలన పూర్తయినా అమలు చేయకపోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో తీసుకుంటే కూటమి ప్రభుత్వం, చంద్రబాబు మోసాలు ప్రతి ఒక్కరికీ తెలిసిపోతాయని మేరుగు నాగార్జున అన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరిని తాను ప్రతి క్షణం ఎండగట్టడానికి వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ పోస్టర్లను నాయకులతో కలిసి మేరుగు నాగార్జున విడుదల చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాకా కోటిరెడ్డి, మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, మద్దా లక్ష్మీనారాయణ, పైడిపాటి వెంకట్రావు, కందుల డానియేల్, బొమ్మల రామాంజనేయులు, గద్దె జాలయ్య, యేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, పల్లపాటి అన్వేష్, మేకల కృష్ణారెడ్డి, శ్రీకాంత్, పిట్టల ఆంజనేయులు, పైనం ప్రభాకర్, లింగా రామకృష్ణారెడ్డి, నాదెండ్ల మహేష్, నారా సుబ్బారెడ్డి అంజిరెడ్డి, వినోద్, జయమ్మ, మస్తానమ్మ, రజని, సంధ్య, కంకణాల సురేష్, శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


బూచేపల్లి కమలాకర్‌రెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, ఇతర కుటుంబ సభ్యులు, మేరుగు నాగార్జున, నాయకులు


ఉచిత కంటి వైద్య శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, అన్నా రాంబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి

- చీమకుర్తి, చుట్టుపక్కల గ్రామాల నుంచి 1600 మందికిపైగా రోగులు హాజరు
- 4,500 మందికి అన్న సంతర్పణ
- సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డికి బూచేపల్లి కుటుంబ సభ్యులు, నాయకుల నివాళులు


చీమకుర్తి: సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చీమకుర్తితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా రోగులు తరలిరావడంతో విశేష స్పందన లభించింది. సుమారు 1600 మందికిపైగా రోగులు వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 650 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని డాక్టర్లు గుర్తించారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి గుంటూరు జిల్లా పెదకాకాని వద్ద గల శంకర కంటి ఆస్పత్రిలో దశల వారీగా బూచేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా బస్సులు ఏర్పాటు చేసి తరలించి ఆపరేషన్లు చేయిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. రోగులకు బూచేపల్లి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు దాదాపు 4500 మందికి అన్నదానం చేశారు.

బూచేపల్లి కమలాకర్‌రెడ్డికి ఘన నివాళులు...

సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని చీమకుర్తిలోని బూచేపల్లి కమలాకర్‌రెడ్డి పార్కులో ఆయన స్మారకం వద్ద ఆయన సోదరుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఆయన తల్లి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కమలాకర్‌రెడ్డికి సంబంధించిన మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో బూచేపల్లి శివప్రసాదరెడ్డి సతీమణి నందిని, సోదరి ధనలక్ష్మి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ బీ జవహర్, డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, సంతనూతలపాడు జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరై కమలాకర్‌రెడ్డికి నివాళులర్పించి సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడు మృతి

- భార్యకు తీవ్ర గాయాలు
- కారును లారీ ఢీకొనడంతో ప్రమాదం
- ఫోన్ చేసిన 20 నిమిషాల వరకు రాని 108 అంబులెన్స్



సంఘటన స్థలంలో సిరిగిరి ఓబయ్య మృతదేహం


కారులో ఇరుక్కుపోయిన జ్యోతి

బేస్తవారిపేట: కారును లారీ ఢీకొనడంతో మాజీ సైనికుడు మృతి చెందగా, ఆయన సతీమణికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై బేస్తవారిపేట మండలం చింతలపల్లి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. గిద్దలూరు మండలం ఆదిమూర్తిపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు సిరిగిరి ఓబయ్య హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలో పూజా కార్యక్రమాలకు భార్య జ్యోతితో కలిసి హైదరాబాద్ నుంచి కారులో బయలుదేరారు. మరో గంటలో గమ్యస్థానానికి చేరుకుంటారనగా మార్గమధ్యంలో లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. అనంతపురం నుంచి కలకత్తా వెళ్తున్న ఓ లారీ బేస్తవారిపేట మండలం చింతలపాలెం వద్ద కారును ఢీకొట్టడంతో ఓబయ్య దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన వారిని స్థానికులు బయటకు తీసి 108కు సమాచారం అందించారు. సుమారు 20 నిమిషాల వరకు సంఘటనా స్థలానికి 108 వాహనం చేరుకోలేదు. తీవ్రంగా గాయపడిన ఓబయ్య సంఘటనా స్థలంలోనే కన్నుమూశారు. తీవ్రంగా గాయపడిన జ్యోతిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై రవీంద్రారెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీఓఏ ఆత్మహత్యాయత్నం

- ఏపీఎం వేధిస్తున్నాడన్న బాధితురాలు


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రమీలరాణి

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం గ్రామానికి చెందిన వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) సంకె ప్రమీలరాణి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎస్సీ కులం కావడం వల్ల వీఓఏగా ఉండేందుకు అర్హత లేదని, బాధ్యతల నుంచి తప్పుకోవాలని 8 నెలల నుంచి ప్రమీలరాణిని వేధిస్తున్నారు. అవసరం లేకపోయినా మీటింగ్స్ నిర్వహించాలంటూ గ్రూప్ సభ్యుల ముందు ఏపీఎం దుర్భాషలాడటంతోపాటు విధుల నుంచి తొలగించడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితురాలు ఆరోపించారు. ఆదివారం ఉదయం వీఓఏల వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించడంతో మనస్థాపానికి గురైన ఆమె పాయిజన్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఆమెను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం కోరుతోంది. ఈ విషయమై ఏపీఎం దేవరాజును వివరణ కోరగా.. 'వీఓఏ ప్రమీలరాణి గ్రూప్ మీటింగులు నిర్వహించడం లేదు. మూడేళ్ల కాల పరిమితి పూర్తవడంతో, ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలగించేందుకు మూడుసార్లు నోటీసులిచ్చాం. సమాధానం ఇవ్వకుండా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు' అని చెప్పారు.

కారు ఢీకొని ఇద్దరు మృతి

- మార్కాపురం మండలం మిట్టమీదిపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఘటన
- మృతులది అర్ధవీడు మండలం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మార్కాపురం: కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి 10:30 గంటల సమయంలో మార్కాపురం మండలం తిప్పాయపాలెం జంగంగుంట్ల గ్రామాల మధ్య మిట్టమీదిపల్లి క్రాస్ రోడ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన బెజవాడ దావీదు(45) అదే మండలం రంగాపురం గ్రామానికి చెందిన విజయ్(25) బైక్‌పై మార్కాపురం నుంచి కంభం వైపు వెళ్తున్నారు. ఈ సమయంలో కంభం నుంచి మార్కాపురం వైపు వస్తున్న కారు మిట్టమీదిపల్లి క్రాస్ రోడ్డు దగ్గర బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్సై అంకమ్మరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డు పక్కన ఒక గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతి చెంది ఉండటాన్ని పోలీసులు గుర్తించారు.


సంఘటన స్థలంలో మృతదేహం

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి


రాజ్యసభ సభ్యుడు వైవీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో ఉన్న వైవీ ఇంటికి వెళ్లి ఆయనకు ఎమ్మెల్యే శాలువకప్పి, బొకే అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల గురించి వారిద్దరు చర్చించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ భూమిరెడ్డి సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, పుల్లలచెరువు మండలంలోని నాయుడుపాలెం, మల్లాపాలెం సర్పంచ్‌లు ఆవుల కోటిరెడ్డి, ఆవుల రమణారెడ్డి ఉన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోకుండా.. రాజకీయాలేందయ్యా..

- ఆర్టీసీ హైర్ బస్సు ఢీకొని మృతి చెందిన నెహేమియా..
- ఆస్పత్రి వద్ద ఇద్దరు పసివాళ్లతో దీనంగా రోదిస్తున్న భార్య
- బస్సు యాజమాని తీరుపై గ్రామ మహిళల ఆగ్రహం


పసిపిల్లలతో మృతుడి భార్య రిబ్కా

పొదిలి: ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృత్యువాతపడిన మర్రిపూడి మండలం శివరాయునిపేట గ్రామానికి చెందిన నెహేమియా కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ మహిళలు ముక్త కంఠంతో కోరుతున్నారు. శనివారం ప్రమాదం చోటుచేసుకోగా ఆదివారం నెహేమియా మృతదేహానికి పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వద్ద పరిణామాలు బాధిత కుటుంబం పడుతున్న వేదనను కళ్లకు కట్టాయి. మృతుడి బంధువులు, గ్రామస్తులు ఆస్పత్రి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని బస్సు యాజమాన్యం తీరును తప్పుబట్టారు. ప్రమాద విషయం తెలిసినప్పటికీ కనీసం పట్టించుకోకుండా రాజకీయాలు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. నాలుగేళ్లు, పది నెలల పసిబిడ్డలను సముదాయిస్తూ దుఃఖంలో మునిగిపోయిన నెహేమియా భార్యను చూసి మహిళలు కంటతడి పెట్టారు. నెహేమియాది శివరాంపురం కాగా, బస్సు యజమానిది పక్కనే ఉన్న చిలంకూరు గ్రామం. 'రోజూ ఒకరి ముఖం ఒకరు చూసుకుంటాం. తప్పు జరిగింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత బస్సు యాజమాన్యంపై ఉంది' అని గ్రామస్తులు పేర్కొన్నారు.

నెహేమియా కుటుంబాన్ని ఆదుకోవాలి

'బేల్దారి పనులు చేసుకుంటూ, డ్రైవర్‌గా వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునే నెహేమియా మృతి చెందడంతో భార్య రిబ్కా, ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారు. బస్సు యాజమాన్యం, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉంద'ని మండల వైఎస్సార్ సీపీ నాయకుడు, సొసైటీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు మొల్లం శివరామిరెడ్డి, దళిత హక్కుల పరిరక్షణ నాయకులు ధర్నాసి పెద్దన్న పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయ సేవలు అందిస్తామని, వారికి చట్టపరంగా న్యాయం జరిగేలా చూస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ సభ్యుడు ధర్నాసి రామారావు భరోసా ఇచ్చారు.


ప్రభుత్వ వైద్యశాల వద్ద గ్రామస్తులు

పోలీస్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సీఐ హజరత్తయ్య


సీఐ హజరత్తయ్యను సత్కరిస్తున్న పోలీస్ యూనియన్ నాయకులు

సింగరాయకొండ: ఏపీ పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సింగరాయకొండ సీఐ సీహెచ్ హజరత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలులోని కేబీ రెస్టారెంట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ఏపీ పోలీస్ అధికారుల సంఘ ఎన్నికల్లో హజరత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ పోలీసుల సమస్యల పరిష్కారానికి, యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు